

నల్లమల కీకారణ్యంలో హెలికాప్టర్ ముక్కలు చెక్కలైన దృశ్యం



ఘటనా స్థలంలో చెట్టుకు అతుక్కుపోయిన మాంసపు ముద్దలాంటి భాగాలు



పావురాల గుట్ట వద్ద సీఎం మృతదేహాన్ని హెలికాప్టర్ ద్వారా పైకి తీస్తున్న దృశ్యం



భద్రతాధికారి మృతదేహాన్ని...

# జననేత మహాప్రస్థానం

ఒక మహా విషాదం. యావత్‌జాతి దిగ్భ్రమకు గురైన ఘోర సంఘటన. తెలుగు లోగిళ్లు కన్నీటి సంద్రాలైన విషమ సన్నివేశం. ఆంధ్రుల అభిమాన నేత, ప్రియతమ ముఖ్యమంత్రి యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి ఇక లేరు. నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గల్లంతయినప్పటి నుంచి 24 గంటలపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. నల్లమల అటవీప్రాంతాన్ని అణువణువూ గాలించిన సైనిక హెలికాప్టర్లు ఎట్టకేలకు ప్రమాద ప్రాంతాన్ని గుర్తించి, మృతదేహాలను తీసుకువచ్చాయి. వైఎస్ క్షేమంగా తిరిగి రావాలని ఆశతో ఎదురుచూసిన, దేవుళ్లకు మొక్కులు చెల్లించిన జనం కోరిక నెరవేరలేదు. ప్రజల వద్దకు వెళుతున్నానంటూ బయలుదేరిన వైఎస్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. సీఎంతో పాటు ఆయన కార్యాలయ ముఖ్యకార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, ప్రధాన భద్రతాధికారి వెస్లీ, పైలట్ ఎస్.కె.భాటియా, కోపైలట్ ఎమ్మెస్‌రెడ్డిలు కూడా ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.

బుధవారం రాత్రి పొద్దుపోవడంతో గాలింపు చర్యల్ని ఆపేసిన సైనిక హెలికాప్టర్లు గురువారం ఉదయాన్నే తిరిగి గాలించడం మొదలుపెట్టాయి. గురువారం తెల్లవారుజామున సుఖోయ్ యుద్ధవిమానం తీసిన ఫొటోలనూ అధికారులు విశ్లేషించారు. ఈ సమాచారంతో పాటు, వెస్లీ నుంచి వచ్చిన చివరి ఎస్ఎంఎస్ ఆధారంగా పాములపాడు సెల్‌ఫోన్ టవర్‌కు 5 కిలోమీటర్ల వ్యాసార్థం పరిధిలో గాలింపు జరిపాక ఒకచోట హెలికాప్టర్ శకలాలు, మృతదేహాలు పడిఉన్న విషయాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు గుర్తించారు. వాయుసేన కమెడోర్ సాగర్ భారతి ఘటనా స్థలాన్ని తొలిసారిగా గుర్తించటంతో జరిగిన ఘోరం లోకానికి తెలిసింది. ఈ వార్తను వెంటనే కేంద్ర హోంమంత్రి చిదంబరానికి చేరవేశారు. ఆయన ఈ విషయాన్ని యూపీఏ అధ్యక్షురాలు సోనియా గాంధీకి తెలియజేశారు. 11.00 గంటలకు ఈ వార్తను సోనియా వ్యక్తిగత కార్యదర్శి అహ్మద్‌పటేల్ ధ్రువీకరించారు. మధ్యాహ్నం 12.30కి ఆర్థిక మంత్రి రోశయ్య అధికారికంగా మరణవార్తను ప్రకటించారు. ఈ వార్త టీవీ ఛానెళ్లలో 'బ్రేకింగ్‌న్యూస్'గా వెలువడడంతో రాష్ట్రం ఒక్కసారిగా శోకసంద్రమైంది. కొందరు గుండె ఆగి మరణిస్తే, ఇంకొందరు వైఎస్ లేని జీవితం తమకెందుకంటూ ఆత్మత్యాగం చేసుకున్నారు. ఇలా చనిపోయిన వారి సంఖ్య 50 మందికిపైగానే ఉంది.

## దారీ తెన్నూ తెలీక...

వైఎస్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కారుమబ్బుల్లో ముందుకురకలేక.. దారీ తెన్నూ తెలీక కుప్పకూలిపోయింది. ఈ ప్రాంతం వెలుగోడు జలాశయానికి ఎగువన... కర్నూలు జిల్లా కేంద్రానికి 70 కిలోమీటర్ల తూర్పు దిక్కున... రుద్రకోడూరుకు 16 కిలోమీటర్ల తూర్పున... పావురాల గుట్టను ఢీకొట్టి ఓ బండరాయికి చేరువలో పడిపోయింది. ఆ బండపై అది వాలడానికి ప్రయత్నించి గుట్టను ఢీకొన్నట్లు అనుమానిస్తున్నారు. పసుపుల తిప్ప మీద చెట్టు కాలిపోయి ఉండడాన్ని బలగాలు గమనించాయి. మరింత కిందకు దిగి పరిశీలించినప్పుడు హెలికాప్టర్ శిథిలాలు బయటపడ్డాయి. ప్రమాద ప్రాంతానికి అత్యంత చేరువలోనే వైఎస్ మృతదేహం పడుందని వాయుసేన నిపుణులు తొలుత గుర్తించారు. అక్కడికి సమీపంలోనే వెస్లీ, సుబ్రమణ్యం, ఇద్దరు పైలట్ల మృతదేహాల్ని కనుగొన్నారు. తెల్లటి వస్త్రాలతో మృతదేహాలను మూటగట్టి పారాట్రూపర్ల సాయంతో హెలికాప్టర్లలోకి లాక్కుని వాటిని కర్నూలుకు తరలించారు. కర్నూలు రెండో పదాతిదళ ప్రాంగణంలో ఆగమేఘాలపై ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి, పోస్ట్‌మార్టం నిర్వహించారు. అక్కడ్నుంచి మృతదేహాలను హెలికాప్టర్లలో హైదరాబాద్‌కు తరలించారు.

## విమానాశ్రయం వద్ద జనసంద్రం

బేగంపేట విమానాశ్రయం వద్ద జనం పోటెత్తారు. ముఖ్యమంత్రి ఆప్త మిత్రుడు కేవీపీ రామచంద్రరావు విమానాశ్రయం వద్ద చాలాసేపు విషణ్న వదనంతో ఎదురుచూశారు. విమానాశ్రయం నుంచి వైఎస్ మృతదేహాన్ని బేగంపేటలోని ఆయన క్యాంపు కార్యాలయానికి తరలించి అక్కడే ఉంచారు. మిగతా నలుగురి మృతదేహాలను వారి ఇళ్లకు పంపించారు. అభిమానులు, కార్యకర్తల రాకతో ముఖ్యమంత్రి నివాసం కిటకిటలాడింది. ఎటుచూసినా ఆర్తనాదాలు, వైఎస్ అమర్‌రహే అన్న నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.

## రోశయ్యకు బాధ్యతలు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆర్థిక మంత్రి కొణిజేటి రోశయ్య ప్రమాణం చేశారు. గురువారం రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో రోశయ్య చేత గవర్నర్ ఎన్డీ తివారీ ప్రమాణ స్వీకారం చేయించారు. రోశయ్య అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశమై వైఎస్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఆ వెంటనే మంత్రివర్గ సభ్యులు వైఎస్ ఇంటికి వెళ్లి, మృతదేహాన్ని సందర్శించి, కుటుంబాన్ని పరామర్శించారు.

## కేంద్ర మంత్రివర్గం సంతాపం

ఢిల్లీలో వేర్వేరుగా సమావేశమైన కేంద్ర మంత్రివర్గం, కాంగ్రెస్ కోర్ కమిటీ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలు వైఎస్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు శుక్రవారం సెలవు ప్రకటిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దేశ రాజధాని ఢిల్లీ, మిగతా రాష్ట్రాల రాజధానుల్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని అవనతం చేయాలని నిర్ణయించింది. వైఎస్ సహజనాయకుడని, సామాన్య ప్రజానీకం గుండెల్లో గూడు కట్టుకున్నారని ఆయన సతీమణికి పంపిన సంతాప సందేశంలో ప్రధాని మన్మోహన్ పేర్కొన్నారు. వైఎస్ మరణవార్త విని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కన్నీటి పర్యంతమయ్యారు. ధైర్యం, దార్శనికత, కఠోరశ్రమకు వైఎస్ మారుపేరుగా నిలిచారని ఆమె కొనియాడారు. సీఎం కుటుంబాన్ని పరామర్శించేందుకు మన్మోహన్, సోనియా గాంధీ, భాజపా అగ్రనేత అద్వానీ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌కు వస్తున్నారు.

## అధికారులు, అభిమానుల అగచాట్లు

సంఘటనా స్థలానికి కాలిబాటన చేరుకోవటానికి అధికారులు, పోలీసులు, వైఎస్ అభిమానులు, మీడియా ప్రతినిధులు ఉదయం నుంచే పడరాని పాట్లు పడ్డారు. సుమారు 16 కిలోమీటర్ల మేర విపరీత వర్షానికి నాని.. దిగబడిపోతున్న అటవీ మార్గంలో ముందుకు కదలటం దుర్భరంగా మారింది. వారంతా ఉరుకులు పెడుతూ కదలినా.. మధ్యాహ్నానికి అత్యంత చేరువగా వెళ్లగలిగారు.

## అంతా హైడ్రామా

ముఖ్యమంత్రి హెలికాప్టర్ గాలింపు నుంచి గుర్తింపు దాకా అంతా హైడ్రామా నడిచింది. మీడియాకు ఏ మాత్రం సమాచారం లేకుండా అధికారులు జాగ్రత్తపడ్డారు. ప్రమాద వివరాలపై ప్రాథమిక సమాచారం అందించాల్సిన జిల్లా ఎస్పీ సెల్ స్విచ్ఆఫ్‌లో ఉండగా కలెక్టర్ నుంచి ఏ సమాచారమూ లేదు. మరోవైపు మంత్రులు చెరో మండలాన్ని పంచుకుని ఎవరికి వారుగా వెళ్లిపోయారు. మంత్రుల్లో రఘువీరారెడ్డి ఒక్కరే సంఘటనా స్థలానికి దగ్గర వరకు వెళ్లారు. అటవీశాఖ మంత్రి రామచంద్రారెడ్డి గజ్జలకొండ ప్రాంతానికి వెళ్లగా... మిగతా మంత్రులు శిల్పా మోహన్‌రెడ్డి, అహ్మదుల్లా, కన్నా లక్ష్మీనారాయణ, బొత్స సత్యనారాయణలకు కూడా స్థానిక నేతల సహకారంతో గాలింపునకు పంపారు. దట్టమైన అడవి కావడంతో రవాణా సదుపాల్లేక డీఐజీ వీఆర్‌కే మోహన్‌రావు ద్విచక్ర వాహనంలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఎం బావమరిది, కడప మేయర్ రవీంద్రనాథ్‌రెడ్డి కొంత దూరం ద్విచక్ర వాహనంతో ఆ తర్వాత నడక ద్వారా సంఘటనా స్థలాన్ని చేరడానికి యత్నించారు. సంఘటనా స్థలం గాలించడానికి మీడియానే స్వయంగా రంగంలోకి దిగింది. కొందరు మాత్రమే సంఘటనా స్థలానికి చేరగలిగారు. చాలా మంది నల్లమలలో చిక్కుకున్నారు. పదుల కిలోమీటర్లు నడిచి నానాతిప్పలు పడి బయటపడ్డ వారే ఎక్కువ. స్టుడియో-ఎన్ కెమెరామెన్ మాత్రం నల్లమలలో తప్పిపోయారు. ఈ సమాచారం ఆయన అందించిన కొంత సేపటికే ఫోన్ పనిచేయలేదు. మరోవైపు నల్లమలను జల్లెడపట్టడానికి వచ్చిన ప్రత్యేక దళాలన్నీ సీఎం హెలికాప్టర్ ప్రమాదానికి గురయ్యారని రుద్రకోడూరు అటవీ ప్రాంతంలో దీనిని గుర్తించినట్లు తెలియగానే వారివారి ప్రాంతాలు తిరిగి వెళ్లిపోయారు.

–న్యూస్‌టుడే యంత్రాంగం



గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద గుమికూడిన జనం

### నేడు ఇడుపులపాయలో అంత్యక్రియలు

వందరోజుల క్రితం రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఎల్‌బీ స్టేడియంలోనే వైఎస్ మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం వరకు ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆ తర్వాత ఆయన సొంత జిల్లా కడపకు తీసుకెళతారు. శుక్రవారం సాయంత్రం ఇడుపులపాయ ఎస్టేట్‌లో పూర్తి అధికార లాంఛనాలతో వైఎస్ అంత్యక్రియలు జరుగుతాయి.

### 24 గంటల తర్వాత ఆచూకీ

ముఖ్యమంత్రి హెలికాప్టర్ మాయమైన 24 గంటల తర్వాతగానీ శకలాల్ని అధికారులు గుర్తించలేకపోయారు. చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్ బుధవారం ఉదయం 8.45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరారు. హెలికాప్టర్ నల్లమల గగనతలంపై ఎగురుతుండగా... 9.15 గంటలకు దాన్నుంచి సంకేతాలు నిలిచిపోయాయి. ఆ వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమై సైన్యం, వైమానిక దళం, నౌకాదళాల్ని రంగంలోకి దించింది. ఇస్రో ఉపగ్రహం, అమెరికా ఉపగ్రహం సాయం తీసుకుంది. దాదాపు 11 హెలికాప్టర్లు ఈ గాలింపులో పాల్గొన్నాయి. తొలిరోజు గాలింపు సత్ఫలితాల్నివ్వలేదు. రెండోరోజు గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో సంఘటన స్థలాన్ని, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాల్ని గుర్తించారు. నాలుగు మృతదేహాలు గుర్తుపట్టని విధంగా ఉండగా... ముఖ్యమంత్రి ముఖం కాస్త పోల్చుకోవడానికి వీలుగా ఉంది.